

కసి

కొలిపాక రమామణి

శ్యామల చేత్తో బిడ్డని జోకొడుతున్నా, మనసు ఎటో ఆలోచిస్తోంది. ఉదయంనించి జరిగిన సంఘటనలు ఒకటొకటే మనోఫలకంమీద బొమ్మల్లా కదలాడుతున్నాయి. తొమ్మిదింటికి పెద్దవాళ్ళిద్దరినీ స్కూలుకి పంపి వీధిలో నుంచుంటే పక్కింటి సీత "శ్యామలా 'మిస్సమ్మ' సినిమాకి వస్తారా? ఈ రోజు ఆఖరి రోజు" అంది. శ్యామల సరేనంది. గబగబా తక్కిన పనులు ముగించి, చంటివాడిని తయారుచేసి సినిమాకి బయలుదేరింది. ప్రక్కింటి సీతా,

అన్నపూర్ణలతోకలిసి ఉదయం సినిమాకి వెళ్ళడం శ్యామలకి అలవాటే. వీళ్ళు వెళ్ళేసరికే న్యూస్ రీల్ మొదలు పెట్టేశారు.

"శ్యామలా, మీ ఆయన కదూ ?" అంది అన్నపూర్ణ, బాగా ముందు వరసలో కూచున్న రాజారావుని చూపిస్తూ, ఇంటర్‌వెల్‌లో. శ్యామల ఆశ్చర్యంగా చూసింది. అతనే. ప్రక్కనే ఇంకో స్త్రీ.

"ఎవరావిడ?" అంది అన్నపూర్ణ.

"ఏమో !" అంది శ్యామల, ముభావంగా, సంశయంగా చూస్తూ.

ముగ్గురాడవాళ్ళూ రాజారావునీ, ప్రక్కావిడని కుతూహలంగా గమనిస్తూ కూర్చున్నారు. శ్యామలకి ఒళ్ళంతా ముళ్ళు గుచ్చుకున్నట్టుగా వుంది.

రాజారావు ప్రక్క కూర్చున్నావిడ చామనచాయగా, నాజూగ్గా ఉంది. తెల్లటి ఆర్గాండీ చీర కట్టింది. దానిమీద గులాబిరంగు దారంతో చిన్న చిన్న పువ్వులు కుట్టి వున్నాయి. పొట్టి జుత్తుని, వెనక్కి కుచ్చులా రబ్బరు బాండ్‌తో బంధించింది. రాజారావూ, ఆమే టీ తాగుతున్నారు. ఆమె చాలా హుందాగా ఉంది.

"మీ అబ్బాయిని పంపండి. వాళ్ళ నాన్నని పిలుస్తాడు" అంది అన్నపూర్ణ.

శ్యామల మాట్లాడలేదు. పిల్లవాణ్ణి క్రిందకి దింపలేదు.

"ఎవరో ఆవిడ ? మీ చుట్టాలా ?"

"ఊహుఁ" అంది శ్యామల.

"ఆయన ఆఫీసులో పని చేస్తోం దేమో!" అంది సీత.

లైట్లు ఆరాయి. సినిమా తిరిగి ప్రారంభమైంది. సినిమా అంతా చక్కటి హాస్యంతో నిండివుంది. ప్రేక్షకులు నవ్వుతున్నారు. సీతా, అన్నపూర్ణా హాయిగా సినిమాకథలో లీనమైపోయారు. కాని శ్యామల కళ్ళకి ఒక్క బొమ్మ కనబడ లేదు. ఒక్కమాట వినబడలేదు. ఆమె మనస్సు అక్కడలేదు.

సినిమా అయింది. రాజారావూ, ఆమే ముందు కదిలారు. శ్యామలా, సఖులూ వెనక నడిచారు. ఆటో ఎక్కబోతూ శ్యామల, ప్రక్కకు చూసి గతుక్కుమంది. ఆమె ఏపిల్ పళ్ళు కొంటోంది. రాజారావు పక్కనే నిలబడి ఇటువైపే చూస్తున్నాడు. ఒక్కనిమిషం అతని కళ్ళు శ్యామల కళ్ళతో కలుసుకున్నాయి. శ్యామల తల తిప్పేసుకుంది. ఆటో కదిలిపోయింది.

ఇంటి కెళ్ళిన గంటకి సీత వచ్చి, శ్యామల తలుపుకొట్టింది. శ్యామల అన్యమనస్కంగా వచ్చి తలుపుతీసి, వెళ్ళి కూర్చుంది. చిన్నవాడు మరమరాలు ఏరుకుతింటున్నాడు.

"శ్యామలా, కాఫీ త్రాగారా ?" అంది సీత.

"లేదు."

"ఆలా కూచుంటే ఏమౌతుంది శ్యామలా! లెండి. తర్వాతఆలోచించుకో వచ్చు. పిల్లలు వచ్చే వేళైంది."

శ్యామల కదలలేదు.

"ఈరోజు మీరూ ఆవిజ్ఞి చూశారు కనక చెప్తున్నాను శ్యామలా. మీ ఆయనా, ఆవిడా రెండేళ్ళనించీ కలిసి తిరుగుతున్నారు. మా ఆయన చూసారు. మన వీధిలో చాలామందికి ఈ విషయం తెలుసు."

"నాతో ఎందుకు చెప్పలేదు మీరు?" అంది శ్యామల. ఆమెలో దెబ్బతిన్న పక్షి కోపం ఉంది.

"ఎలా చెప్పం శ్యామలా? మీ ఆయన ఎవరితోనో తిరుగుతున్నాడనా? ఇంతకీ వాళ్ళిద్దరి సంబంధం తెలియదు. మీ సంసారం చక్కగా వుంది. లేనిపోనివి చెప్పి కలతలు కలిగించడం దేనికి?" సీత చాలా అనునయంగా చెప్పింది.

ఆ మాటా యీ మాటా చెప్తూ సీత చాలాసేపు కూచుని, పిల్లలు వచ్చాక వెళ్ళింది.

శ్యామల వంట అయిందనిపించి, పిల్లలకి పెట్టి, పడుకోబెట్టింది.

"మొగుడు కొట్టినందుకు కాదు, తోటికోడలు నవ్వినందుకు" అన్నట్టు శ్యామలకి ఆ వీధివారిమీద కోపంగా ఉంది. తనవెనక ఎంతమంది నవ్వు కుంటున్నారో? అందరికీ తెలుసుట. తనకే యీ విషయం ఆఖరున తెలిసింది. అనుమానించడానికి కూడా రాజారావులో, అతని ప్రవర్తనలో కొట్టవచ్చిన తేడా ఏమీ కనిపించలేదు శ్యామలకి. పెళ్ళైన దగ్గరనించీ ఒక్కలాగే ఉన్నాడు. ఉదయం తొమ్మిదింటికి ఆఫీసుకని ఇల్లు వదిలితే, రాత్రి మళ్ళీ తొమ్మిక్కి, పదిగంటలకే ఇల్లు చేరడం. ఇంటిఖర్చుకని శ్యామల అడిగినంత డబ్బు ఇస్తాడు. పిల్లలను ఎక్కువ చేరతియ్యడు. అలా అని దూరంగా నెట్టివెయ్యడు.

తలుపు టకటక లాడింది. శ్యామల వెళ్ళి తలుపు తీసింది. రాజారావు ఏమీ జరగనట్టే వచ్చాడు. బట్టలు మార్చు కుని, కాళ్ళు కడుక్కుని వచ్చాడు. "భోజనం పెడతావా?" అన్నాడు భార్యదగ్గరికి వచ్చి. వంటకాలన్నీ వెచ్చచేసి పెట్టడం అలవాటు శ్యామలకి. అప్రయత్నంగానే ఆమె లేచి, వంటకాలు వెచ్చచేసి టేబిల్‌మీద పెట్టింది.

"నువ్వు తిన్నావా?" అన్నాడు రాజారావు, భోజనానికి ఉపక్రమిస్తూ.

శ్యామల మాట్లాడలేదు. అతను రెట్టించి అడగలేదు. అతను భోజనం చేస్తూ వుంటే, శ్యామల కోపంతో ముందుగదిలోకి వెళ్ళి కూర్చుంది.

రాజారావు భోజనంచేసి, వక్క పలుకు వేసుకుని ముందుగదిలోకి వచ్చి, చేతిలోకి పేపరు తీసుకున్నాడు. అతని

నిర్లక్ష్యం చూస్తే ఒళ్ళుమండింది శ్యామలకి.

"ఆవిడెవరు ?" అంది తీక్షణంగా చూస్తూ.

"వూఁ ?" తలపైకి ఎత్తేడు రాజారావు.

"మీతో సినిమాకి వచ్చినావిడ ఎవరు ?"

"సునీత."

"మీ ఆఫీసులో పనిచేస్తోందా ?"

"కాదు."

"రెండేళ్ళుగా మీ ఇద్దరూ కలిసి తిరుగుతున్నారుట. నాతో ఎందుకు చెప్పలేదు ?"

"నీకుతెలుసు ననుకున్నాను."

"ఎలా అనుకున్నారు ?" ఆమెలో కోపం రెట్టించింది.

"అందరికీ తెలిసినట్టే, నీకూ తెలిసి వుంటుందని లేదా ఎవరేనా చెప్పి వుంటారని."

"నా కెవ్వరూ చెప్పలేదు."

రాజారావు మాట్లాడలేదు.

"మీ ఇద్దరిదీ ఎలాంటి సంబంధం?"

"నువ్వు అనుకునేలాంటిదే."

"అంటే ?"

"నువ్వు నాకు ఎంతో, సునీతా అంతే."

"నేను భార్యని, ఆవిడ నాతో సమానం ఎలా అవుతుంది ?"

ఉద్రేకంతో శ్యామల కంఠం జీరబోయింది.

"నీ మెళ్ళో తాళి కట్టాను. ఆమె మెళ్ళో కట్టలేదు. అదే తేడా." రాజారావు తాపీగా అన్నాడు.

"ఇద్దరు భార్యలా ?"

"అలాగే అనుకో." అతని నిర్భీతికి అసహ్యించుకుంది శ్యామల.

"మీరిలా అన్యాయంగా మాట్లాడుతూ వుంటే, నే నింక ఏమనగలను ?"

"ఉండు శ్యామలా, ఉద్రేకం వద్దు. సావకాశంగా మాట్లాడుకుందాం." తాపీగా అన్నాడు రాజారావు.

ఆమె మాట్లాడలేదు.

"నాకూ, సునీతకీ మూడేళ్ళనించీ పరిచయం ఉంది. ఎలా అయింది, ఎక్కడ అయింది అంటూ పాత కథలు తిరిగి చెప్పుకోడం అనవసరం. కాని ఆ పరిచయం పెరిగి, అనుకోని రూపం దాల్చింది."

"ప్రణయంలోకి మారింది అంతేగా!"

"నువ్వే పేరుతో పిలిచినా అభ్యంతరంలేదు కాని మా ఇద్దరిమధ్యా పరస్పరాకర్షణ పెరిగింది. ఆమె చదువూ, తెలివితేటలూ, విషయ పరిజ్ఞానం, మాట తీరూ - నన్ను ఆవిడవైపుకు లాక్కువెళ్ళాయి. నాలో ఆవిడ ఏం చూసిందో, కాని సునీతా నాకు చేరువైంది."

"మీరు వివాహితులనీ, పిల్లలు ఉన్నారని తెలుసా ?"

"సునీతకి మనింటి విషయాలు అన్నీ తెలుసు."

"హుం. అన్నీ తెలిసే మీతో అలా తిరుగుతోందా ?"

"అది నువ్వనుకున్నంత తొందరగా జరగలేదు శ్యామలా ! ఎంతో ఘర్షణా, మానసికంగా ఎంతో అశాంతీ అనుభవించాం."

"చివరికి నా మనశ్శాంతి తుడిచేసారుగా! అయినా, నేను మీకంత నచ్చకపోతే ఎందుకు పెళ్ళి చేసుకున్నారు ?"

"నువ్వు నచ్చకపోతే చేసుకునేవాడిని కాను. ఇప్పటికీ నీలో నాకేం లోపం కనిపించదు."

"అందుకే దాన్ని తగులుకున్నారు." కసిగా అంది శ్యామల.

రాజారావు ముఖం చిటపటలాడింది. "అంత నీచంగా మాట్లాడకు శ్యామలా."

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు? నాకు విడాకులిచ్చి, ఆ విడ ని చేసుకుంటారా ?"

"నీకు నేను విడాకులు ఇవ్వను. ఎప్పటిలాగే మన సంసారం నడిచిపోనీ."

"అదెలా సాధ్యం ? ఆవిడ సంగతీ, మీ సంబంధం తెలిసాక నేను మీతో కాపరం చెయ్యలేను" శ్యామల చరచరా పడకగదిలోకి వెళ్ళి చంటివాడి పక్కన పడుకుంది. ఆమె మనసులో కోపం, ఉక్రోషం, ఈర్ష్య!

కాస్సేపటికి రాజారావు వచ్చి, తన మంచంమీద పడుకుని అన్నాడు - "ఈ మూడేళ్ళుగా నీకు ఏ సంగతీ తెలియదు. మన సంసారం సాఫీగా సాగిపోతూ ఉంది. నా ప్రవర్తనలో తేడా ఏమీ నీకు కనిపించలేదు. ఇకముందూ నీ యెడల నా ప్రవర్తన మారదు. నీకూ, పిల్లలకి ఏ హానీ జరగదు."

"మీరు మా నుంచి దూరంకావడం కన్న పెద్ద నష్టమేమిటి వుంటుంది ?" శ్యామల కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"మీకు నేను ఎప్పుడూ దూరం కాను" అన్నాడు రాజారావు.

శ్యామలకి రాత్రంతా నిద్దరపట్టలేదు. ఎన్నో ఆలోచనలు, శంకలు, భయాలు. రాజారావు పిల్లలు కలగకుండా ఆపరేషన్ చేయించుకున్నాడు. మరి ఆ సునీతకి ఈ సంగతి తెలుసా ? ఎందు కీయనని పట్టుకున్నట్టు ?" ఎన్నాళ్ళు పట్టుకుంటుంది ?

రోజులు గడుస్తున్నాయి. శ్యామల ఏ నిర్ణయానికీ రాలేకపోయింది. రాజారావుకి విడాకులు ఇద్దామనుకుంది. కాని యీ వయస్సులో తనకి ఉద్యోగం ఎవరిస్తారు ? ఒక దర్జాలో బ్రతుకుతున్న తను డబ్బు యిబ్బందులు పడుతూ పిల్లలని పైకి తీసుకురాగలదా ? కాలు ముందుకువెయ్యాలంటే పిల్లల భవిష్యత్తు అడ్డువస్తోంది. కాని తను ఊరుకుంటే ఆమెని తిన్నగా తెచ్చి ఇంట్లోనే పెడతాడేమో రాజారావు !

"నేనే ఇలాంటి పని చేసివుంటే మీకు ఎలా ఉండేదో ?" అంది శ్యామల ఒకరోజు రాజారావుతో.

"ఎలాంటి పని ?"

"అదే, ఇంకో మగవాడిమీద మోజు కలిగిందని చెప్పి, వేరే తిరుగుతూ ఉంటే."

"అవును శ్యామలా, నేనూ అలాగే ఆలోచిస్తూవుంటా. నా భార్య యింకో పురుషుడితో తిరుగుతే నేను సహిస్తానా అని ! ఆ ప్రశ్నకి నాకు జవాబు దొరకనేలేదు.''

"మీకేం ఎన్ని మాటలైనా చెప్తారు. ఇవాళ సునీత, రేపు ఇంకో గీత.

సిరిలేని వాళ్ళకి ఎంతమంది అయితేనేం?" శ్యామల కసి తీర్చుకుంది.

"పొరపాటు శ్యామలా. నేను వ్యభిచారిని కాను."

"మరి, దీని పేరేమిటో ?" సణుక్కుంది శ్యామల

శ్యామల ఏ నిర్ణయం తీసుకోకుండానే రోజులు దొర్లిపోతున్నాయి. రాజారావు మునపటిలాగే అడిగినంత డబ్బు శ్యామల కిస్తున్నాడు. అతని దినచర్యలో మార్పులేదు శ్యామల మాత్రం భర్తకి శారీరకంగా దూరమైంది. ముభావంగా అతని అవసరాలు చూస్తుంది.

శ్యామల రాత్రీ, పగలూ ఆలోచించింది. కాని తన సమస్యకి పరిష్కారం కనిపించలేదు రాజారావుని వదిలేసి, పిల్లలతో సంసారభారం మొయ్యలేదు. అలా అని అతనితో సంసారం చెయ్యలేదు.

శ్యామల మానసికంగా చిత్రహింస అనుభవించింది. అతను డబ్బు ఇస్తాడు. తనని మర్యాదగానే చూస్తాడు. కాని మనిషికి కావలసిన ప్రేమ కరువైంది. రాజారావు ప్రేమా, వ్యామోహం అంతా ఆ రెండవ స్త్రీ మీదే !

ఎందుకిలా జరిగింది ? శ్యామల గిజగిజ లాడింది. తను పెద్దగా చదువుకోలేదు. సునీత అంత నాజూకుగా ఉండదు. నిజమే! కాని యిన్నాళ్ళ తమ వైవాహిక జీవితం అంతా బూటకం అంటే శ్యామలకి కడుపులో కలిచినట్టైతోంది.

ఆమె వ్యధతో సంబంధంలేకుండా రోజులూ, నెలలూ గడిచాయి. పిల్లలు పెద్దవాళ్ళు అవుతున్నారు. శ్యామల దృష్టంతా పిల్లలమీదే కేంద్రీకరింపబడింది. భర్తకి దూరమై కొద్దీ, పిల్లలకి చేరువైంది. తల్లీ, పిల్లలూ ఒకరిగా మెలిగారు.

పిల్లలు పెద్దవాళ్ళు అవుతుంటే రాజారావులో కూడా మార్పు వచ్చింది. అతడు శ్యామలకి దగ్గిరగా రావాలనీ, పిల్లలతో ఎక్కువ సమయం గడపాలనీ ఆశించేవాడు. కాని శ్యామల యింకా దూరం జరిగింది.

"నీ పద్ధతి నాకేం అర్థంకావటం లేదు" అన్నాడు రాజారావు, ఆ రాత్రి శ్యామలతో.

శ్యామల మౌనంగా ఉండిపోయింది.

ఎన్నాళ్ళిలా దూర దూరంగా ఉంటావు ?" రెట్టించాడు రాజారావు.

"మీరే నన్ను దూరంచేశారు."

"చేసుకున్న భార్యనే ప్రేమించాలని ఏదైనా రూల్ ఉందా ? ఒక మగవాడు ఇద్దరు స్త్రీలను ప్రేమించకూడదా ?"

"నేను మిమ్మల్ని ఎప్పుడూ తప్పు పట్టలేదు మీ మనసుకు తోచినట్టు మీరు చేశారు. నా మనసు చెప్పినట్టు నేను నడుచుకుంటా " శ్యామల చాలా శాంతంగా జవాబు చెప్పింది.

"నీకు నేను ఏం తక్కువ చేశాను ? నువ్వు కోరినంత డబ్బు ఇస్తున్నాను."

"అందుకే మీకు భోజన సదుపాయం చేస్తున్నాను."

"పిల్లలను కూడా నాకు దూరం చేస్తున్నావు. వాళ్ళు నాదగ్గిరకి చనువుగా రారు, మాట్లాడరు." రాజారావు కంఠంలో విచారం వుంది.

"ఇన్నాళ్ళూ మీకు పిల్లల అవసరం కనిపించలేదు. వాళ్ళని ఏనాడూ చేర తియ్యలేదు...మీ వ్యామోహంలో మీరు వున్నారు. పిల్లలు కూడా పెద్దవాళ్ళు అవుతున్నారు. వాళ్ళకీ జ్ఞానం వచ్చి మంచీ, చెడ్డా తెలుస్తోంది. ఒక్కసారి మీరు ఆప్యాయత ఒలకబోసి రమ్మంటే, వాళ్ళు ఉక్కిరి బిక్కిరి అవుతారే కాని లేని ప్రేమ నటించలేరు."

రాజారావు సాలోచనగా భార్యవైపు చూశాడు. ఆమెలో చాలా మార్పు కనిపించింది. మునపటి అమాయకత్వం లేదు. కస్సుబుస్సుమనే కోపం లేదు. ఒకరకమైన శాంతం వచ్చింది. కాని ఆ నెమ్మదితనం ఎదుటి వ్యక్తిని స్థిరంగా ఉండనివ్వక కలవరపెడుతోంది.

రాజారావు భార్యకి తిరిగి దగ్గిర అవ్వాలనే ప్రయత్నంలో విఫలు డయ్యాడు. తన ఇంటికి తనే అతిథిగా మారాడు. పిల్లలూ, శ్యామలా ఒకటి – తను పరాయివాడు.

అతనికి హఠాత్తుగా సునీతమీద ఉండే వ్యామోహం, ఆకర్షణ తగ్గిపో జొచ్చాయి. చేరువవుతున్నకొద్దీ వాళ్ళద్దరి మధ్యా భేదాభిప్రాయాలు పొడచూపాయి. అతని లోపాలు ఆమెకి, ఆమెలోని బలహీనతలు అతనికీ తెలిసిపోయాయి.

రాజారావు నిర్లిప్తంగా కాలం వెళ్ళ బుచ్చాడు. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు అయ్యారు. చదువులూ, వారి వివాహాలు జరిపించారు శ్యామలా, రాజారావు. కొడుకు లిద్దరూ ఉద్యోగరీత్యా దూర ప్రదేశాలు వెళ్ళారు. కాలం ఎంత ముందుకు వెళ్ళినా, జీవితంలో ఎన్ని మార్పులు జరిగినా శ్యామల మారలేదు. రాజారావు జుత్తు పండింది. డయాబిటిస్ వ్యాధితో బాధపడ్డాడు, సునీత గుండె జబ్బుతో మరణించింది.

రాజారావు రిటైర్ అయ్యే రోజులు వచ్చాయి. ఆరోజు కూతురిని అత్తవారింటికి పంపి, శ్యామల ఓ చిన్నసంచీతో రాజారావు దగ్గిరకి వచ్చింది.

"నేను వెళుతున్నాను" అంది.

"ఎక్కడికి ?" ఆశ్చర్యపోయాడు రాజారావు.

"ఆశ్రమానికి"

"ఎందుకు ?"

"ఇక్కడ నా కింక పనిలేదు. కొడుకు పెండ్లి చేసా. కూతురిని అత్తవారింటికి పంపాను."

"చిన్నవాడి పెండ్లి చెయ్యవా ?"

"అది పెద్దవాడి బాధ్యత."



రాజారావుకి భయంవేసింది.

"మరి నా సంగతి ? నన్నెవరు చూసుకుంటారు ?"

"మీ సంగతి చూడవలసిన బాధ్యత నాకు లేదు. ఇన్నాళ్ళూ డబ్బు ఇచ్చారు పిల్లలని పెంచి పెద్దవాళ్ళని చేసాను. మనిద్దరి మధ్యా డబ్బు సంబంధం తప్ప ఇంక ఏంవుంది ?"

"ఇంకేమీ లేదా శ్యామలా ? ఎంత కఠినంగా మాట్లాడుతున్నావు !"

"ఇంకే సంబంధం వుంది ?" శ్యామల అతని కళ్ళలోకి చూస్తూ సూటిగా ప్రశ్నించింది.

రాజారావు కాస్సేపు సమాధానం చెప్పలేకపోయాడు.

"చాలా అన్యాయం శ్యామలా ! నన్నీ వయసులో, యీ పరిస్థితిలో వదిలి వెళ్ళిపోవడం."

శ్యామల జవాబు చెప్పలేదు. సంచీ చేతబట్టుకుని లేచింది.

రాజారావు ఆమె చెయ్యి పట్టుకున్నాడు "వద్దు శ్యామలా నీ అవసరం నాకుంది. నువ్వు లేకుండా నేను ఎలా బ్రతుకను ! నా అవసరాలు ఎవరు చూస్తారు. నామీద జాలితోనైనా వుండిపో. నీకు మాత్రం ఓ తోడు వద్దా ? ఒంటరిగా గడపగలవా ?"

"హుం. ఇన్నాళ్ళూ ఒంటరిగానే గడిపాను. నాకు తోడు వద్దా అంటున్నారు. నాకో తోడూ, మనసుకో ప్రేమా కావలసినప్పుడు మీ రివ్వగలిగారా ? ఎప్పుడైతే మీరు వేరేతోడు వెతుక్కున్నారో ఆనాడే ఒంటరిదానినయ్యాను. ఇప్పుడు నాకు క్రొత్త కాదు."

శ్యామల అతని చెయ్యి విడిపించుకుని ముందుకు సాగింది.

రాజారావు ఆమె కఠినహృదయానికి బాధపడ్డాడు శ్యామల మెత్తని మనసు యింత కఠినశిలలా ఎప్పుడు మారిందో? అతను కుప్పలా కూలిపోయాడు.